సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



ఉయ్యాలే ఉరి తాడై..

ఉయ్యాల ఉరితాడై షేక్ తాహిరా అనే చిన్నారి ప్రాణం తీసింది. ఈ సంఘటన కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది. - 8లో



ఇక తిరుపతి నుంచే గల్ఫ్ జర్నీ !

ఉభయ వైఎస్సార్ జిల్లా నుంచి ఎడారిదేశాలకు విమానపయనం..ఇక సులభతరం కానుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఏడీసీఎల్ ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. - 10లో



18 నుంచి పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

పుష్పగిరిలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం కడపలోని తన స్వగృహంలో ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆవిష్కరించారు. - 8లో



వేడెక్కుతోంది

- జిల్లాలో మండుతున్న ఎండలు
- ఆట్లూరులో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తల సూచన





కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఒక్క సారిగా ఎండలు సెగలు కక్కుతున్నాయి. 14వ తేదీ శుక్రవారం జిల్లాలోని అట్లూరులో 44.4 డిగ్రీలు 15వ తేదీ జమ్మలమడుగులో 42.1 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త, కోర్డినేటర్ వీరయ్య, వాతావవరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు సూచించారు. మరో మూడు రోజులపాటు ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతలకంటే మరో రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రం వాతావారణ శాస్త్రవేత్తలు తెలియజేశారు. ప్రజలు ఉదయం 11 గంటలలోపే పనులు చూసుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు.అత్యవసర పని నిమిత్తం బయట తిరిగే వాళ్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ నీటిని తాగాలని, అప్పడప్పుడు ఓఆర్ఎస్ లేదా ఉప్పు, నిమ్మకాయ రసాన్ని, టెంకాయి నీళ్లను తాగాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులకు వెళ్లేవారు కూడా వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎండల వల్ల ఎవరికైనా ఆలసట అనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఎండలకు బయటకు వెళ్లదాని సూచించారు.

గొడుగులు, టోపీలు, కళ్లాద్దాలకు డిమాండ్

మార్చి నెల ఆరంభం నుంచి చలి తీవ్రత క్రమంగా తగ్గుతోంది. ఎండల ప్రభావం కనిపిస్తోంది. ఎండల నుంచి ఉపశమనం ఉంటుందని భావించి గొడుగులు, టోపీలు, టవళ్లు, ఖర్చీఫ్‌లు కొనుగోలు చేస్తున్నారు. వాహనదారులు కూడా కళ్లకు సంబంధించి జాగ్రత్తలో భాగంగా రకరకాల కళ్లాద్దాలను కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో 14న నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

గ్రామం	ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో
అట్లూరు	44.4
కడప	43.8
సిద్దవటం	43.3
ముద్దనూరు	42.8
గుండ్లకుంట	42.4
రామనపల్లె	42.2
జమ్మలమడుగు	42.1
చక్రాయపేట	42.1
పోరుమామిళ్ల	41.1
కలసపాడు	42.0
ఉప్పలూరు	42.0
వల్లూరు	42.0

15న నమోదైన ఉష్ణోగ్రతలు

జమ్మలమడుగు	42.1
పాయలకుంట్ల	41.5
చౌడూరు	41.4
సింహాద్రిపురం	41.3
లింగంపల్లె	41.3
పోరుమామిళ్ల	41.2
సిద్దవటం	41.1

జిల్లాలో నమోదైన దయేరియా కేసుల వివరాలు

సంవత్సరం	దయేరియా కేసులు
2020	24,744
2021	4565
2022	7002
2023 (ఇప్పటివరకు)	1666

అప్రమత్తంగా ఉండాలి



రాబోయే మూడు రోజుల్లో ఎండల్లో చేసే పనులను వాయిదా వేసుకోవాలి. ఉదయం 11 గంటలలోపే పనులు పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకోవాలి. వీలైనంత నీడలోనే ఉండేందుకు ప్రయత్నం చేయాలి. నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ వీరయ్య, కృషి విజ్ఞానకేంద్ర ప్రధాన శాస్త్రవేత్త. కో ఆర్డినేటర్.

రోజుకు ఆరు లీటర్లు నీరు తాగాలి



అత్యంత వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల చర్మంలోని నీటి శాతం పూర్తిగా ఆవిరైపోతుంది.చెమట ద్వారా సోడియం లవణాలు ఎక్కువగా, కొంత పోటాషియం లవణాలు కూడా వెళ్లిపోవడంతో హీట్ హైపర్ పైరెక్సియా అనే వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది. దీంతో జ్వరం వస్తుంది. వాంతులవుతాయి.అందువల్ల బయటకు వెళ్లేవారు ఉప్పు బాగా వేసుకుని మజ్జిగ తీసుకోవాలి. అరటిపండు తప్పకుండా తీసుకోవాలి.ఇందులో పొటాషియం స్థాయి ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ రోజుకు నాలుగు నుంచి ఆరు లీటర్ల నీరు తాగాలి.

– డాక్టర్ మనోహర్, చర్మవ్యాధి నిపుణులు,

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



వేసవిలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. కూలీలు పనులు చేసే ప్రాంతాలకు కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపించే ర్యలు చేపట్టాం. కాచి చల్లార్చిన నీరు దయేరియాను అరికట్టవచ్చు. ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఫ్లాష్.. ఫ్లాష్..

నెత్తురోడిన రహదారి

- కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు కార్లు ఢీ.. ముగ్గురి మృతి
- ఐదుగురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాద దృశ్యం





రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారు



మృతదేహాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారి మార్గంలో అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం బీసీ కాలనీ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు నెల్లూరు నుంచి రాయచోటి వైపు ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న కారు రామాపురం మండలం బీసీ కాలనీ సమీపానికి రాగానే రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న మరో కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ఒక మహిళతో పాటు మరో ఇద్దరు పురుషులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని తొలుత చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. కాగా, కడపవైపు వెళ్తున్న కారులో ఉన్న డ్రైవర్, ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారు ముగ్గురితో పాటు తీవ్రంగా గాయపడిన నెల్లూరుకు చెందిన మరో మహిళను లక్కిరెడ్డిపల్లె నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రామాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్నే మా భవిష్యత్తు అంటున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు



మాట్లాడుతున్న కె.సురేష్‌బాబు

కడప సెవెన్‌రోడ్స్ : తన ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేసిన దేశంలోని ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావడం వల్లే నేడు రాష్ట్ర ప్రజలు జగనన్నే మా భవిష్యత్తు అంటూ ముక్తకంఠంతో ఆలపిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పార్టీ కార్యకర్తలు, గృహ సారథులు, వలంటీర్లు నిర్వహిస్తున్న ఈ మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమంలో ఇప్పటికీ 48 లక్షల మంది తమ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమం ముగిసే నాటికి ఆ సంఖ్య మరింతగా పెరుగుతుందని చెప్పారు. గత సాధారణ ఎన్నికల్లో నవరత్నాల పథకాల ద్వారా ప్రజల్లోకి వెళ్లామన్నారు. జగన్‌పైన నమ్మకంతోనే ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా 151 అసెంబ్లీ స్థానాలు, 22 పార్లమెంటు స్థానాలు తమ పార్టీకి కట్టబెట్టారన్నారు. ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. ఇటీవల జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తూనే టీడీపీ తమపై అవాకులు, చెవాకులు పేలడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు వాపు మాత్రమేనని చెప్పారు. ఇటీవల మచిలీపట్నం, గుడివాడల్లోని టిడ్కో ఇళ్ల వద్ద చంద్రబాబునాయుడు సెల్ఫీలు తీసుకుని వాటిని తామే కట్టించినట్లు గొప్పలకు పోవడం సిగ్గుచేటన్నారు. ఆయన హయాంలో టిడ్కో ఇళ్ల ఒక్కొ లబ్ధిదారు నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదన్న విషయం గమనించాలన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో తమ పార్టీ 175 సీట్లను గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అఫ్జల్‌ఖాన్, సూర్యనారాయణ, యానాదయ్య, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైవీయూలో నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. యోగివేమనయూనివర్సిటీ. ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఈనెల 19 నుంచి 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

152 మంది గైర్హాజరు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన పది సోసియల్ పరీక్షకు 152 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 146 పరీక్షా కేంద్రాల్లో 27251 మంది హాజరుకావాల్సి ఉండగా 27099 మంది హాజరయ్యారు. జిల్లాలోని 50 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీ చేయగా ఆరింటిని డీఈఓ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

17నుంచి పాలిసెట్‌కు శిక్షణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17వ తేదీ నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయన్నారు. పాలిసెట్ పరీక్ష ద్వారా ఈ విభాగాల్లో ప్రవేశాలు కౌన్సిలింగ్ ద్వారా జరుగుతాయని తెలిపారు. పాలిసెట్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు.

మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : పది పరీక్షలకు సంబంధించి సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని పది పరీక్షల అబ్జర్వర్, మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకాన్ని కేంద్రాన్ని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గదికి లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు జరిగే మూల్యాంకనానికి ఉపాధ్యాయులు గుర్తింపు కార్డు(ఐడీకార్డు)తో రావాలన్నారు. మాస్కులు ధరించాలని, సెల్‌ఫోన్లు వినియోగించరాదని చెప్పారు.పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, అందుకు సహకరించిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రక్తదాన సేవలకు పురస్కారం



మాజీ క్రికెటర్ బ్రెట్‌లీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న తారీఖ్‌అలీ

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన 'ఖాన్ కా రిస్తా'స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు తారిఖ్ అలీ చేస్తున్న స్వచ్ఛంద రక్తదాన సేవా కార్యక్రమాలకు పురస్కారం దక్కింది. శనివారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రెట్‌లీ ముఖ్యఅతిథిగా విచ్చేసి 'ఇండియా బ్రాండ్ ఐకాన్ సర్వీస్ ఎక్స్‌లెన్స్ బ్లడ్ డొనేషన్ ఇన్షియేటివ్ అవార్డ్ ఫర్ ఇయర్ 2022'అవార్డును తారీఖ్ అలీకి అందజేశారు. తారీఖ్ అలీ 2015లో ఖాన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (కేకేఆర్)ను స్థాపించి 8 సంవత్సరాలుగా రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రక్తదాన ఆవశ్యకతను గుర్తించి ఇప్పటి వరకు స్నేహితులతో కలిసి 185 రక్తదాన శిబిరాలు, 292 ఉచిత రక్తనిర్ధారణ శిబిరాలు నిర్వహించామన్నారు. తమ సంస్థకు బ్రెట్‌లీ పురస్కారం లభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకారం అందించిన మాజీ రంజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పీఎం రవికుమార్‌కు అవార్డు ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న రవికుమార్

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత వర్గాల అభివృద్ధి సంఘం నిర్వాహకులు పీఎం రవికుమార్‌బాబుకు శనివారం న్యూఢిల్లీలో జాతీయ బుద్ధ సంఘ్ అంబేడ్కర్ రత్న అవార్డును ప్రదానం చేసింది. ఢిల్లీ నుంచి రవికుమార్ ఈ మేరకు సమాచారం అందజేశారు. శనివారం ఢిల్లీలోని పాలికా కేంద్రంలో గల ఎన్‌డీఎంసీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక సభకు కేంద్ర ఉక్కు గనులశాఖ మంత్రి ఫగ్గన్‌సింగ్ ఈ అవార్డును అందజేశారు. దేశంలోని ఒక్కొక్క రాష్ట్రం నుంచి అంబేడ్కర్ స్ఫూర్తితో సేవలు అందించిన ఒక్కొక్కరికి ఈ అవార్డు ప్రదానం చేయగా, ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో రవికుమార్‌కు మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం. అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు వర్గాల అభివృద్ధి కోసం సేవలు అందించినందుకు ఈ అవార్డును అందజేశారు.

క్లుప్తంగా

సిద్ధార్థలో వర్చూసా సెంటర్ ప్రారంభం



వర్చూసా సావనీర్‌ను విడుదల చేస్తున్న అశోకరాజు, కృష్ణ త్యాగరాజన్

నారాయణవనం(తిరుపతి జిల్లా): పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల్లో శనివారం బెంగళూరుకు చెందిన ప్రముఖ వర్చూసా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు, వర్చూసా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ త్యాగరాజన్ కేంద్రాన్ని ప్రారంభించి సావనీర్‌ను విడుదల చేశారు. అనంతరం కృష్ణ త్యాగరాజన్ మాట్లాడుతూ సిద్ధార్థలో మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో రెండో సెంటర్‌ను ప్రారంభిస్తామని అన్నారు. వర్చూసా సెంటర్ల ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు అప్‌డేటడ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. అశోకరాజు మాట్లాడుతూ మెరుగైన స్థాయిలో ప్లేస్‌మెంట్లు పొందడానికి ఈ కేంద్రాలు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, ప్లేస్‌మెంట్ అధికారులు మణిమోహన్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కొండాపురం : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. సింహాద్రిపురం మండలంలోని హిమగుంట్ల గ్రామానికి చెందిన రవీంద్రనాయుడు, చంద్ర బుధవారం కొండాపురం నుంచి తిరిగి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గంమధ్యలో లావనూరు సాయిబాబా గుడి దగ్గర రోడ్డుపై చనిపోయిన గేదెను ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రవీంద్రనాయుడును కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

• అయ్యో చిన్నారి

ఉయ్యాలే ఉరి తాడై..

చిన్నపిల్లలకు ఉయ్యాల ఊగడం మహా సరదా. వేసవి కాలంలో బయటికి వెళ్లి ఆడుకోవాలంటే.. ఎండలు భగభగ మండుతున్నాయి. కావున చాలా మంది నీడ పట్టున ఉయ్యాల ఊగుతుంటారు. అలానే ఓ బాలిక ఇంట్లో చీరతో కట్టిన ఉయ్యాలలో ఊగసాగింది. కానీ ఆ చిన్నారికి ఏం తెలుసు.. అదే ఉరితాడు అవుతుందని.. తనకు తాను గుండ్రంగా తిరుగుతూ ఊయల ఊగింది. అంతే చీర మెడకు చుట్టుకుని, ప్రాణం తీసేసింది. ఈ విషాదకర సంఘటన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెలో శనివారం చోటుచేసుకుంది.



మృతి చెందిన తాహీరా

కురబలకోట : కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన మహమ్మద్ ఆజం స్థానికంగా మదర్సా నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె షేక్ తాహిరా(11) స్థానికంగా ఉన్న యూపీ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లిన తర్వాత.. అక్కడ చీరతో కట్టిన ఊయల ఊగసాగింది. తనకు తాను గుండ్రంగా తిరుగుతూ ఊగుతుండగా చీర మెడకు చుట్టుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. మిగిలిన వారు మధ్యాహ్నం పక్కన ఇంటిలో నమాజ్‌లో ఉన్నారు. తర్వాత వచ్చి చూస్తే విద్యార్థిని స్పృహ కోల్పోయిన స్థితిలో ఉండటాన్ని గమనించారు. వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంతకు ముందు వరకు సహ విద్యార్థులతో ఆడుతూ పాడుతూ తిరిగిన విద్యార్థిని ఆకస్మికంగా మృతి చెందడం పలువురిని తీవ్రంగా కలచివేసింది. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు విశేష స్పందన

కడప అర్బన్ : కడప జిల్లా కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్), కడప బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని పలువురు అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. ఈ సందర్భంగా కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.సుబ్రమణ్యం మాట్లాడుతూ త్వరలో జరగబోవు జూనియర్ సివిల్ జడ్జి ప్రధాన పరీక్షల్లో అభ్యర్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారిలో ధైర్యాన్ని, నమ్మకాన్ని పెంచేందుకు ఈ మోడల్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం నాయకులు, న్యాయవాదులైన జి.వి మారుతీ రెడ్డి, ఐఏఎల్ సెక్రటరీ కె.అనిత, కె.గురురాజా, ఐ.రాజా, ఎల్. నాగసుబ్బారెడ్డి, ఏ.వి.శివరామ్, న్యాయవాదులు వి.రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న న్యాయవాదుల సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఒంటిమిట్ట : మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న కడప- చెన్నై జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల మేరకు... రాజంపేట మండలం వెంకటరాజంపేట గ్రామానికి చెందిన రంగయ్య(60), సుధాకర్(55) కారులో కడప నుంచి రాజంపేటకు బయలుదేరారు. మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో గల జాతీయ రహదారి వద్దకు రాగానే వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో.. రోడ్డు పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి రక్త గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనికి తీసుకొచ్చారు.

వెలుగు సిబ్బందిపై కేసు

తొండూరు : తొండూరు మండలం గంగనపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా చేసిన అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం వివరాలు వెల్లడించారు. యానిమేటర్ హెనిమ దాదాపు రూ.30 లక్షల సొమ్ము ఇటీవల స్వాహా చేసిన సంఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి వెలుగు సీసీ గంగాధర, యానిమేటర్ హెనిమపై కేసు నమోదు చేశారు.

ముగ్గురిపై దాడి

కలకడ : ముగ్గురిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాలక్రిష్ణ తెలిపారు. ఏఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లె గ్రామానికి చెందిన రెడ్డెమ్మ, రాజేశ్వరి, శ్రీనివాసులుపై కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన వెంకటరమణ (ఉపాధ్యాయుడు), గరడప్పగారిపల్లెకు చెందిన రెడ్డిరాజేష్, ప్రకాష్, సాయి, కొత్తగాండ్లపల్లెకు చెందిన యజ్ఞశాలయ్య, బాలయ్యగారిపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన కె.బాలాజీ కలిసి గురువారం దాడి చేశారు. వారిలో గాయపడిన రెడ్డెమ్మను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కారులో మంటలు

ప్రొద్దుటూరు : అనుకోకుండా కారులో మంటలు చెలరేగాయి. లోపల తల్లీబిడ్డ ఉన్నారు. వెంటనే మున్సిపల్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన శ్రీకాంత్ తన భార్యతోపాటు చంటిబిడ్డను తీసుకుని కారులో ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్ కోసం వారు ఇక్కడికి వచ్చారు. శనివారం ఉదయమే కదిరిలో బయల్దేరిన వీరు మధ్యాహ్నం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లగా చంటిబిడ్డతో ఆయన సతీమణి ఏసీ వేసుకుని కారులో నిద్రపోయారు. ఉన్నట్టుండి కారు ఇంజన్‌లో పొగలు వచ్చాయి. 15–20 నిమిషాలకు దట్టమైన పొగలు రావడంతో అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది కారులో ఉన్న ఆమెను నిద్ర లేపి కిందికి దించారు. మున్సిపల్ ఏఈ దస్తగిరిరెడ్డి మోటార్ ఆన్ చేసి సిబ్బంది ద్వారా క్యాన్లతో మంటలను ఆర్పివేశారు. లోపలికి వెళ్లిన శ్రీకాంత్ బయటికి వచ్చి చూసి ఆశ్చర్యపోయాడు. ఇంజన్‌లోని బ్యాటరీ వేడికి షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇలా జరిగిందని, ఇంకా కొద్దిసేపు ఆలస్యం జరిగి ఉంటే కారు అద్దాలు కూడా సీజ్ అయ్యేవని పక్కనున్న డ్రైవర్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది సాయంతో కారును షెడ్డుకు చేర్చారు.



కాలిపోయిన కారు ఇంజన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మానవత్వం మరిచాడు..!

మృతదేహాన్ని దించేసి వెళ్లిన డ్రైవర్

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యక్తి నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వస్థలానికి టాక్సీలో వెళ్తుండగా, మర్రిపాడు వద్ద గుండెపోటు వచ్చి మృతి చెందాడు. మానవత్వాన్ని మరచిన టాక్సీ డ్రైవర్.. మృతదేహాన్ని తాను తీసుకువెళ్లబోనని మర్రిపాడులోనే రోడ్డు పక్కన దింపేసి వెళ్లిపోయాడు. దిక్కుతోచక రోడ్డు పక్కన టవల్‌పై భర్త మృతదేహాన్ని ఉంచి భార్య రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు పంపించారు. ప్రొద్దుటూరుకు చెందిన ఆదినారాయణ (46) ఆరు నెలల కిందట నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రిలో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నారు. వైద్య పరీక్షల కోసం ఆయన తన భార్య శివలక్ష్మితో కలిసి శనివారం నెల్లూరుకు వచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ప్రొద్దుటూరుకు టాక్సీలో బయలుదేరారు. మార్గంమధ్యలో మర్రిపాడు వద్దకు చేరుకోగానే ఆదినారాయణకు గుండెపోటు వచ్చి మృతి చెందాడు. నెల్లూరు నుంచి కిరాయికి వచ్చిన టాక్సీ డ్రైవర్ తన వాహనంలో మృతదేహాన్ని తీసుకువెళ్లబోనని మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోనే దించేసి వెళ్లిపోయాడు. శివలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ విషయం తెలుసుకున్న మర్రిపాడు ఏఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తమ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించి తక్షణమే అంబులెన్స్ మాట్లాడి మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు పంపించారు.



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య శివలక్ష్మి

బైక్‌ల చోరీపై కేసు నమోదు

మదనపల్లె : మదనపల్లె మండలం, పట్టణంలో ఇటీవల తొమ్మిది బైక్‌లు చోరీకి గురయ్యాయయని బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ, తాలూకా సీఐ సత్యనారాయణలు తెలిపారు. మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహమ్మద్ షరీఫుల్లా, సయ్యద్‌బీన్, వీరాంజనేయులు, జిలానీబాషా, రెడ్డికుమార్, యాసిన్‌బాషా, మస్తాన్‌లకు చెందిన ద్విచక్రవాహనాలు చోరీకి గురికాగా కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా మండలంలోని సీటీఎంకు చెందిన గోపాల్, రెడ్డిశేఖరలకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురికాగా తాలూకా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని సీఐలు తెలిపారు.

చిల్లర రాజకీయాలు మానుకో!

- ఎల్లో బ్యాచ్ మెప్పు కోసమే అవాకులు, చవాకులు
- మాజీ ఎమ్మెల్యే డీఎల్‌పై మేయర్ సురేష్‌బాబు ధ్వజం



మాట్లాడుతున్న సురేష్ బాబు

సాక్షి ప్రతినిధి, కడప: 'మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డికి మతిభ్రమించింది. రాజకీయ ఆకాంక్ష ఉన్నా ఏ రాజకీయ పార్టీ దగ్గరికి తీయడం లేదు. దీంతో చిల్లర రాజకీయాలు చేస్తూ, ఎల్లో బ్యాచ్ దృష్టిలో పడాలనే తాపత్రయం ప్రదర్శిస్తున్నాడు' అని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ కుటుంబం అండతో రాజకీయంగా ఎదిగిన డీఎల్, సమాజం అసహ్యించుకునేలా వైఎస్ కుటుంబ సభ్యులపై అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆరోపించారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలనే కోరిక ఉంటే ఉండొచ్చు గానీ, తెలుగుదేశం నాయకుల దృష్టి పడాలనే తపన తాపత్రయంతో వైఎస్ కుటుంబాన్ని టార్గెట్ చేసి విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. వైఎస్ కుటుంబం అండ ఉన్నన్నాళ్లు రాజకీయాల్లో చురుగ్గా మెలిగిన డీఎల్, ఆ కుటుంబానికి దూరమయ్యాక కనుమరుగయ్యారనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు.

భారతమ్మపై అకారణ ద్వేషం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మపై మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డి అకారణమైన ద్వేషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు దూరంగా బిడ్డల ఉన్నతి కోసం శ్రమిస్తూ, వ్యాపారాలకు పరిమితమై ఉన్న భారతమ్మపై నిందలు వేయడం సిగ్గుమాలిన చర్యగా వర్ణించారు.

డీఎల్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలి

మైదుకూరు : మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డికి పిచ్చి పట్టిందని, ఆయనను వెంటనే పిచ్చాసుపత్రిలో చేర్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం డీఎల్ రవీంద్రారెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. శనివారం మైదుకూరులో వ్యవసాయశాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీపీలు, నాయకులు విలేకరులతో మాట్లాడారు. కడప జిల్లా పర్యటనకు రానున్న చంద్రబాబు దృష్టిలో పడేందుకే సీఎంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా నాయకుడు జేష్టాది రవికుమార్, రాష్ట్ర ఐబీసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, బి.మఠం, చాపాడు, దువ్వూరు ఎంపీపీలు సి.వీరనారాయణరెడ్డి, లక్షుమయ్య, జయచంద్రారెడ్డి, మైదుకూరు వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్లు కరీముల్లా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, శివపురం సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ బండి నాగేంద్రబాబు, రామిశివారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం




మాట్లాడుతున్న ఐపీఎస్ సుమతి

రాజంపేట రూరల్ : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఐపీఎస్ బి.సుమతి తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాక సమీపంలో ఉన్న శాన్వి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శనివారం సీబీఎస్‌సీ వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐపీఎస్ బి.సుమతి మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితులలో కూడా విద్యాసంస్థలను విజయవంతంగా కొనసాగించిన శరత్‌కుమార్‌రాజు ఆదర్శవంతుడని కొనియాడారు. అనంతరం సీబీఎస్‌సీ 10వ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, డైరెక్టర్ భరత్‌కుమార్‌రాజు, సీఈఓ శంకర్‌రాజు, ప్రిన్సిపల్ విజయనిర్మల, బీబీయన్ ప్రిన్సిపల్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18 నుంచి పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పుష్పగిరిలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం కడపలోని తన స్వగృహంలో ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 22న చందనోత్సవం, 23న గరుడ వాహనం, 24న కల్యాణోత్సవం, 25న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 23న బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాగా ఉత్సవాలకు రావాలని ఆర్టీసీ చైర్మన్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నాయకులు చెన్నకేశవరెడ్డి, పుష్పగిరి ఆలయ అర్చకులు సుమంత్, ఆదినిమ్మాయపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, పుల్లయ్య యాదవ్, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

కడప అర్బన్ : అగ్నిప్రమాదాలను అప్రమత్తంగా ఎదుర్కోవాలని కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.బసివిరెడ్డి తెలిపారు. కడప అగ్నిమాపక కేంద్రం పరిధిలో గల రవీంద్రనగర్‌లో గంగమ్మగుడి దగ్గర ప్రజలకు ఎల్‌పీజీ గ్యాస్ వలన కలిగే ప్రమాదాన్ని ఏవిధంగా అరికట్టాలో వారికి అవగాహన కల్పిస్తూ వారి చేతనే ప్రయోగ పూర్వకంగా ప్రదర్శింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు రాకుండానే తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తరువాత సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని హెచ్‌పీసీఎల్ వద్ద మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలు జరగకుండా, జరిగినపుడు వాటి నివారణ చర్యలు వివరించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా వెంటనే 101, 08562–242299, 99637 37191లకు సమాచారం ఇవ్వాలని బసివిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ఏడీఎఫ్‌ఓ బసివిరెడ్డి